



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	36	24
భద్రాద్రి	36	24

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సా) : 6:25 (శనివారం)
సహర్ (ఉ) : 4:55 (ఆదివారం)



సాకారం దిశగా..
నవ్య భద్రాద్రి

సీఎం ఆదేశాల మేరకు ఆలయ విస్తరణ, అభివృద్ధిపై అధికారుల కసరత్తు

అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇటు ఉమ్మడి జిల్లా మంత్రుల చొరవతో ప్రసిద్ధ భద్రాచల రామాలయ క్షేత్ర అభివృద్ధికి కసరత్తు మొదలైంది. ఈ నెల 11న భద్రాద్రి పర్యటనకు వచ్చిన సీఎం... ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులు భద్రాద్రిలో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టారు. విస్తరణలో భాగంగా రామాలయానికి ఉత్తరం వైపు కాకుండా, మిగిలిన మూడు వైపులా ఒకటిన్నర నుంచి రెండు ఎకరాల స్థలాన్ని సేకరించాలని, ఇందుకు సుమారు 50 ఇళ్లను తొలగించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఆలయ దక్షిణభాగం వైపు ఉన్న చిత్రకూట మండపం వంటశాలను తొలగించక తప్పదని భావిస్తున్నారు. ఇక ఇప్పటివరకు దక్షిణం వైపు ఉన్న ఆళ్వార్ల ఆలయాలను ఉత్తరం వైపు ఏర్పాటు చేయాలని, అలాగే గతంలో ప్రతిపాదించిన రెండు నూతన ప్రాకారాల పరిధిలోనే వంటశాల, నిత్యాన్నదాన సత్రం నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా ప్రతిపాదిస్తున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి ఈ నెల 18న కలెక్టర్‌కు నివేదిక సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.

భద్రాచలం, మార్చి 15: రామభక్తులు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధికి కసరత్తు ప్రారంభమైంది. ఇంతకాలం ప్రకటనలకు, వాగ్దానాలకు పరిమితమైన అభివృద్ధి ముఖచిత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కార్యాచరణ ప్రణాళిక దిశగా అడుగులేస్తోంది. ఈ నెల 11న భద్రాద్రి పర్యటనకు వచ్చిన సీఎం... డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి భద్రాద్రి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఆలయాభివృద్ధి కోసం ఎంత మేరకు స్థల సేకరణ చేయాలి? ఎన్ని ఇళ్లు తొలగించాల్సి ఉంటుంది తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికతో నివేదికను నెలరోజుల్లో ఇవ్వాలని జిల్లా కలెక్టరు ప్రియాంకను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే కలెక్టర్, పీవో ప్రతీక్ జైన్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో కె.దామోదర్‌రావు తదితరులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



ఈ నెల 11న భద్రాద్రి రామాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఆలయం మూడు వైపులా రెండెకరాల స్థలం సేకరణ
- సుమారు 50ఇళ్లను తొలగించే అవకాశం
- కనుమరుగు కానున్న చిత్రకూట మండపం
- నూతనంగా రెండు ప్రాకారాల నిర్మాణం
- వెయ్యి మందికి సరిపడేలా అన్నదాన సత్రం
- విస్తరణ, నూతన నిర్మాణాలపై పలు ప్రతిపాదనలు
- క్షేత్రస్థాయిలో మూడు శాఖల అధికారుల సర్వే
- 18న భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పణ

క్షేత్రస్థాయిలో సర్వే

కలెక్టరు ఆదేశాలమేరకు భద్రాద్రి దేవస్థానం, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో శుక్రవారం రామాలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై రామాలయ పరిసరాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు.' డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ నాగరాజు, దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్, రెవెన్యూ ఆర్‌ఐ బి.నరసింహారావుతోపాటు సర్వేయర్లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. చప్టా దిగువ, రాజవీధి, ఉత్తర ద్వారం వైపు, తూర్పుమెట్ల వైపు పరిశీలించి ఎంతమేరకు ఆలయాభివృద్ధిని విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. కాగా రామాలయ అభివృద్ధికి ఉత్తరం వైపు కాకుండా మిగిలిన మూడు వైపులా సుమారు ఒకటిన్నర నుంచి రెండు ఎకరాల స్థలాన్ని సేకరించాల్సి ఉంటుందని అధికారుల ప్రాథమిక అంచనాల్లో తేలినట్లు సమాచారం. దీంతో సుమారు 50 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని వారు అంచనా వేస్తున్నారు. ఇది పూర్తిస్థాయిలో అధికారికంగా ఖరారు కానప్పటికీ ప్రాథమికంగా పరిశీలిస్తున్నారు. సర్వే అనంతరం నివేదిక సోమవారం భద్రాద్రి కలెక్టరుకు అధికారులు అందజేయనున్నారు.

చిత్రకూట మండపం కనుమరుగేనా?

రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపం ఇక కనుమరుగు కానుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ దక్షిణ భాగం వైపు విస్తరణ చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉండటంతో ఈ వైపునే ఉన్న చిత్రకూట మండపం వంటశాలను తొలగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎటువంటి నిర్ణయం వెలువడనప్పటికీ అభివృద్ధిలో భాగంగా చిత్రకూట మండపం తొలగించక తప్పనిపరిస్థితులు ఉన్నట్లు సమాచారం.



ఆ రెండు ప్రాకారాలు..

భద్రాద్రి రామాలయంలో రెండు ప్రాకారాలు నిర్మించాలని గతంలోనే అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఈసారి సైతం ఈ ప్రతిపాదన తెరపైకి రావడంతో ఇందుకు సంబంధించి కసరత్తు జరుగుతోంది. ఇప్పటి వరకు దక్షిణం వైపు ఉన్న ఆళ్వార్ల ఆలయాలను ఉత్తరం వైపు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు వినికిడి. అలాగే రెండు ప్రాకారాల పరిధిలోనే నూతన వంటశాల, ఉచిత నిత్యాన్నదాన సత్రం ఉండే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం మిథిలా స్టేడియం కింది భాగంలో ఉచిత నిత్యాన్నదాన సత్రం నిర్వహిస్తుండగా అది భక్తులకు పూర్తిస్థాయిలో సౌలభ్యంగా లేకుండా ఉండటమే కాకుండా భారీ వర్షాలు, వరదల సమయంలో తరచూ నీట మునుగుతుండటంతో అన్నదానానికి ఆటంకాలు ఏర్పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో ముంపు సమస్య లేకుండా రెండు ప్రాకారాల్లోనే వెయ్యి మందికి అన్నదానం అందించేలా సత్రం నిర్మించాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా రామాలయం ఉత్తరం, దక్షిణం, తూర్పువైపు రహదారిని 40 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. పడమర వైపు 70 అడుగులు ఉండాలని కసరత్తు చేపడుతున్నట్లు తెలిసింది.



రామాలయం పరిసరాల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

టీఎస్ పోయి టీజీ వచ్చే...

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు టీఎస్ బదులుగా టీజీ నెంబర్లు షురూ అయ్యాయి. తొలి రోజు శుక్రవారం నగరంలో టీజీ 04 0002 నెంబర్ నుంచి ప్రారంభం కాగా తొలి నెంబర్‌ను మహిళ దక్కించుకున్నారు. టీజీ 04 0055 నెంబర్ వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి జరిగాయి. తొలి నెంబర్ 0002ను రఘునాథపాలెం మండలం చిమ్మపుడికి చెందిన బట్టా మల్లేశ్వరి సీఎన్జీ గ్యాస్ కారుకు పొందారు. కాగా ఆన్‌లైన్‌లో ముందస్తు నెంబర్ రిజర్వేషన్లు భారీస్థాయిలో నమోదు జరిగాయి. టీజీ04 0567నెంబర్‌ను గోడపర్తి విజయలక్ష్మీ రూ.72,500కు పొందారు. ఇక టీజీ04 0999 నెంబర్‌ను తోట లక్ష్మీ భవాని రూ.2,21,000కు బిడ్డింగ్‌లో పొందారు. తొలి రోజు జిల్లా రవాణాశాఖకు సాధారణ రిజిస్ట్రేషన్ చార్జీలకు అదనంగా రూ.6,07,965 రాబడి వచ్చింది. అయితే తొలి రోజు టీజీ నెంబర్‌తో రిజిస్ట్రేషన్‌లు జరిగినా సాంకేతిక కారణాల వల్ల వాహన రిజిస్ట్రేషన్ కార్డులను వాహనదారులు పొందలేక పోయారు.



హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ సభ్యుడు జావీద్‌కు ఖర్జూరాలు తినిపిస్తున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



'సుడా' మాస్టర్‌ప్లాన్‌పై

చూపు సారించరూ!

ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వున్న ముసాయిదా

- రాబోయే 40ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తయారీ
- నిర్మాణ అనుమతుల కోసం 4వేల మంది ఎదురు చూపులు
- ఇప్పటికే రూ.50కోట్లు ఆదాయం కోల్పోయిన కేఎంసీ

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 15: స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) పరిధిలో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌కు మోక్షం లభించటం లేదు. ఫలితంగా ఖమ్మం నగర పాలకసంస్థ (కేఎంసీ) భారీగా ఆదాయం కోల్పోతోంది. పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటంతో సుమారు 4వేల నిర్మాణ అనుమతులను పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఖమ్మం నగరపాలకసంస్థ సుమారు రూ.50కోట్ల మేర ఆదాయం కోల్పోయింది. సుడా పరిధిలో రూపొందించిన నూతన మాస్టర్‌ప్లాన్ చివరిదశకు వచ్చింది. ముసాయిదా కూడా తయారైంది. ప్రభుత్వ అనుమతి వస్తే నూతన మాస్టర్‌ప్లాన్ అమలులోకి వస్తుంది. అన్ని బాలారిష్టాలు దాటి ఎట్టకేలకు ముసాయిదాను గత ప్రభుత్వ అనుమతికి పంపారు. అయితే అదే సమయంలో నిజామాబాద్‌తోపాటు కొన్ని కార్పొరేషన్లలో నూతన మాస్టర్‌ప్లాన్ రూపొందించటంలో అన్యాయం జరిగిందని ఆందోళనలు జరగటం, అవి ఉద్రిక్తతకు దారితీయటంతో నూతన మాస్టర్‌ప్లాన్‌ల ఆమోదాన్ని గత ప్రభుత్వం నిలిపివేసింది. దీనివల్ల సుడా మాస్టర్‌ప్లాన్ ఆమోదం పెండింగ్‌లో పడింది

నాలుగు నియోజకవర్గాల పరిధిలో..

ఖమ్మం, మధిర, పాలేరు. వైరా నియోజకవర్గాల పరిధిలోని 6 మండలాల్లోని 46 గ్రామ పంచాయతీలను చేరుస్తూ సుడా నూతన మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. బెంగుళూరుకు చెందిన స్టైమ్‌కంపెనీకి మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను అప్పగించారు. ఆ కంపెనీ ప్రతినిధులు 'సుడా' పరిధిలో పర్యటించి, రాబోయే 40ఏళ్లలో పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. సుమారు 20లక్షల జనాభాకు అనుగుణంగా ఈ మాస్టర్‌ప్లాన్ ఉంది. భవిష్యత్‌లో రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. వాణిజ్య ప్రాంతాలు, నివాస ప్రాంతాలు, మిక్స్‌డ్ ప్రాంతాలను గుర్తించారు. పలు దఫాలుగా అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి, అభ్యంతరాలు స్వీకరించారు. అందుకు అనుగుణంగా మార్పులు చేసి నూతన మాస్టర్‌ప్లాన్ ముసాయిదా తయారు చేసి గత ప్రభుత్వానికి పంపారు. కానీ ఆటంకాలు ఏర్పడటంతో అనుమతికి నోచుకోలేదు.

పాత మాస్టర్‌ప్లాన్‌తో చిక్కులు

ప్రస్తుతం అమలవుతున్న 14ఏళ్ల నాటి మాస్టర్‌ప్లాన్‌తో చిక్కులు ఎదురవుతున్నాయి. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఖమ్మం చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి అంచనాలు తయారు చేయించారు. అందులో భాగంగా నగరంలో పలుప్రాంతాల్లో 80 అడుగులు, 100 అడుగులు వెడల్పుతో రహదారులు నిర్మించాలని నిర్ణయించారు. ఈ అంశాలను మాస్టర్‌ప్లాన్‌లో రూపొందించారు. అనంతరం ఖమ్మం విస్తీర్ణం పెరిగి ఔటర్‌రింగ్ రోడ్ కాస్తా ఇన్నర్ రింగ్‌రోడ్ అయింది. దీంతో ఔటర్‌రింగ్‌రోడ్ ప్రతిపాదనలను విరమించుకున్నారు. కానీ అప్పటి మాస్టర్‌ప్లాన్‌లో ఆయా అంశాలను అలాగే ఉంచారు. దీంతో చిక్కులు మొదలయ్యాయి. ముస్తఫానగర్, కవిరాజ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేస్తే, ఆయా స్థలాల గుండా 80 అడుగులు, 100 అడుగుల రహదారులు పోతున్నాయని దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఔటర్‌రింగ్‌రోడ్ ప్రతిపాదనలు రద్దయినా, పాత మాస్టర్ ప్లాన్‌లో వాటిని తొలగించకపోవటంతో ఈ దురవస్థ నెలకొంది. సుమారు 4వేల మంది నిర్మాణ అనుమతులను అధికారులు తిరస్కరించారు.



ఆదాయం కోల్పోతున్న నగరపాలకసంస్థ

నూతన మాస్టర్‌ప్లాన్ అమలులోకి రాకపోవటంతో ఖమ్మం నగరపాలకసంస్థ సుమారు రూ.50కోట్ల వరకు ఆదాయం కోల్పోయింది. ఎందుకంటే నూతన మాస్టర్‌ప్లాన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు, తమకు అనుమతులు రాకపోవటంతో, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో నిర్మాణ అనుమతులకు ఫీజుల రూపేణా వచ్చే సొమ్ములు, అనంతరం ఆస్తిపన్నులు నగర పాలకసంస్థకు రావటం లేదు. దీంతో భారీగా ఆదాయం కోల్పోతున్నారు.

ప్రజలు మెచ్చేలా

పరిపాలన

- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కట్టుబడి వున్నాం
- మున్నేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఈత మిత్రుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం/ ఖమ్మం రూరల్, మార్చి 15: ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తుందని, జనం కోరుకున్నట్టుగానే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రశాంతమైన ప్రజాపాలన అందించడమే తమ ధ్యేయమని వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి వద్ద గల గురుదక్షిణ ఫౌండేషన్‌లో ఎన్నెస్పీ లెఫ్ట్ కెనాల్ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈతమిత్రుల ఆత్మీయ సమ్మేళనానికి తుమ్మల ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజలంతా ప్రజాపాలన కోసం కాంగ్రెస్‌ను గెలిపించారని, గత ప్రభుత్వం అప్పులతో అధోగతి పాలు చేసిందన్నారు.

వర్షాకాలంలో ముందుచూపు లేకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి నీటిని వదిలేయడం వల్ల అటు శ్రీశైలం, ఇటు నాగార్జునసాగర్‌లు ఖాళీ అయి మంచినీటి సమస్య నెలకొందని పేర్కొన్నారు. సాగునీరు పక్కన బెట్టినా మంచినీరుకు కూడా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ ఉంచుకోలేని పరిస్థితిని సృష్టించాయని, ఆ విధ్వంసాన్ని సరిచేసుకుంటూ ఈ వేసవికాలంలో రోజుకు రూ.50కోట్ల విద్యుత్ కొంటే తప్ప పంటలు కాపాడుకోలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. మంచి ప్రణాళికతో నీతి, నిబద్ధతతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రజాపరిపాలన సాగిస్తుందన్నారు. ఖమ్మం మున్నేరు వద్ద అన్ని సౌకర్యాలు కల్పించి పర్యాటకంగా తీర్చిదిద్దుతామని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక అందించాలన్నారు. రాత్రి, తెల్లవారుజామున కూడా ఈతమిత్రులు స్విమ్మింగ్ చేసేందుకు విద్యుత్, రహదారి సౌకర్యం కల్పిస్తామని, అలాగే మున్నేరు ఆనకట్టను పెంచి నీరు నిల్వ ఉండేలా చూస్తామని పేర్కొన్నారు. మున్నేరుకు రెండు వైపులా శుభ్రం చేసి ప్రజలు సాయంత్రం వేళ కుటుంబాలతో వచ్చి ఉల్లాసంగా గడిపేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, హార్టికల్చర్, రెవెన్యూ తదితర శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు.

గురుదక్షిణ ఫౌండేషన్‌లో మొక్కలు వేసి పచ్చదనంతో ఉంచాలని, విద్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించేలా అవసరమైతే ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటామని తుమ్మల పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చాగంటి వెంకటేశ్వరరావు, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, చావా ప్రసాద్, వేగినాటి లక్ష్మయ్య, కమర్తపు గోపాలరావు, మందపల్లి లక్ష్మణరావు, పుసులూరి నరేందర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా గురుదక్షిణ ఫౌండేషన్‌లో తుమ్మల మొక్కలు నాటారు.



పుచ్చతోటలో మంత్రి

భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలోని తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న పుచ్చపంటలను మంత్రి తుమ్మల శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. భద్రాద్రి జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ, రిటైర్డ్ ఉద్యాన కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆదర్శరైతు పొన్నుస్వామి మంత్రి వెంట ఉన్నారు. - దమ్మపేట



ముగిసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు

- 91,618 దరఖాస్తుల్లో 78,037 ఆమోదం
- ఇంకా పరిశీలనలో 6,491 దరఖాస్తులు
- 7,090 దరఖాస్తుల తిరస్కరణ
- ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటన

6

తాగునీటి సమస్య

తలెత్తనివ్వం

- రూ.8కోట్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలి
- కలెక్టర్ వీపీ గౌతమ్

6





మహిళా ఆర్థిక

సాధికారత ఇదేనా!?

- బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలో 31వ స్థానానికి దిగజారిన ఖమ్మం జిల్లా

6

ముగిసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 15 : పట్టభద్రుల ఓటుహక్కు నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు ఓటుహక్కు నమోదుకు భారీగానే దరఖాస్తులు అందించారు. గతంలో 87,172 ఓటర్లు ఉండగా, తాజాగా 91,618 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరిని ఓటరుగా నమోదు చేసుకొనేలా అవకాశం కల్పించారు. 2023నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రి. లేదా తత్సమాన విద్యార్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉన్నవారికి ఓటరుగా అవకాశం కల్పించారు.

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరెడ్డి రాజీనామాతో ఖాళీ ఏర్పడ్డ వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక చేపట్టాల్సి ఉంది.. ఎన్నికల నిర్వహణకు తాజాగా ఎలక్టోరోల్ తయారీకి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 30, పబ్లిక్ నోటీస్ జారీ కాగా ఫిబ్రవరి 6 వరకు ఫారం 18 ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.. ఫిబ్రవరి 24 డ్రాఫ్ట్ ఎలక్టోరోల్ ప్రచురణ , ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ, మార్చి 29 వరకు అభ్యంతరాల పరిష్కారం ఏప్రిల్ 4న తుది జాబితాను ప్రకటించనున్నారు. అర్హత తేదీ 2023 నవంబర్ 1 నాటికి కనీసం 3 ఏళ్ల ముందు గ్రాడ్యుయేట్ తత్సమాన అర్హత పూర్తి చేసి ఉన్నవారికి ఓటుహక్కును కల్పించనున్నారు.

గత పట్టభద్రుల ఎన్నికల్లో (2021) జిల్లా వ్యాప్తంగా మొత్తం 87,172 మంది ఓటర్లుఉన్నారు. తాజాగా శుక్రవారం గడువు మీరిన తర్వాత జిల్లాలో21 మండలాల్లో ప్రస్తుతం 91,618 దరఖాస్తులు అందాయి. వీటిలో 87,938 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందగా వాటిని ఆయా మండల తహసీల్దారు కార్యాలయాల్లో డౌన్‌లోడ్ చేసుకుని బీఎల్వోలతో విచారణ చేపట్టారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన మొత్తంలో 78,037 దరఖాస్తులు పరిపరిష్కరించారు. వీటిలో ఇంకా 6,491 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. 7090 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన వాటిని మార్చి 29లోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏప్రిల్ 4న ప్రచురించనున్న తుది జాబితాలో ఓటుహక్కును కల్పించనున్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం: కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 15: తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ స్పష్టం చేశారు. జిల్లాలో రిజర్వాయర్లలో నీటి లభ్యత రోజురోజుకీ తక్కువవుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందుల రాకుండా చర్యలు చేపట్టాం. దీనికోసం ఎస్డీఎఫ్ నుంచి రూ. 8కోట్లు కేటాయించాం అన్నారు. మిషన్‌భగీరథకు ముందు ఉన్న స్కీములన్నింటినీ పునరుద్ధరించాలని ఆదేశించాం. గ్రామాల్లో అవసరం ఉన్న ప్రాంతాల్లో బోర్లు కూడా మంజూరి చేశాం. పైపులైన్ల మరమ్మత్తులు లీకేజీ నివారణతో పాటు తీవ్ర నీటి ఎద్దడి ఉన్నచోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించాం. పట్టణ గ్రామ పంచాయతీల్లో అధికారులకు సూచించాం. వాస్తవానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటి కొతర జిల్లాలో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటడంతో ఈ పరిస్థితులు దాపురించాయి.

ఖమ్మం నగరంలో ఇప్పటికే దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్‌ను ఎన్నెస్పీ జలాలతో నింపాం. అయినా రాబోయే అవసరాలను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్లాన్ -సి ప్రకారం గ్రామాల్లో అవసరాన్ని బట్టి వ్యవసాయ బోర్లు, బావులు, పైపులైన్లను కూడా అద్దెకు తీసుకుని తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాస్తవంగా ఒక వ్యక్తికి 120 లీటర్ల నీటి అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నీటి కొతర కారణంగా నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పట్టణాల్లో పబ్లిక్ ట్యాపుల వద్ద ట్యాపులను కట్టేసి ఉంచాలని నీటిని వృధా చేయవద్దని సూచించారు.

డిజిటల్ లైబ్రరీతో ఉపయోగాలు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్

ఖమ్మం లీగల్, మార్చి15: న్యాయవాదులకు జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీతో ఎంతో ఉపయోగాలుంటాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి జగ్జీవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కోర్టులో నూతన డిజిటల్ లైబ్రరీని ప్రారంభించి మాట్లాడారు. కేసుకు సంబంధించిన కేసు లాను ప్రింట్ తీసుకుని న్యాయవాదులు తమ కేసులలో ఫైల్ చేసుకోవచ్చన్నారు. తెలంగాణలో డిజిటల్ లైబ్రరీ హైదరాబాద్ తరువా త ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయ టం గర్వకారణం అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ఉపాధ్యక్షుడు మాదిరాజు లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎం.జే ప్రవీణ్‌కుమార్, గ్రంధాలయ కార్యదర్శి గాజుల అమర్‌నాథ్, కెవివి. లక్ష్మీ, బార్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏడీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం, మార్చి15: ఇటీవల అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ.నరేష్‌కుమార్ శుక్రవారం కలెక్టర వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వదకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు మొక్కను బహూకరించారు.

వాహనాలకు టీజీతో రిజిస్ట్రేషన్: ఎంవీఐ వరప్రసాద్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

వైరా, మార్చి 15: తెలంగాణ రాష్ట్రంలో ఇక నుంచి వాహనాల రిజిస్ట్రేషన్లు టీజీతో జరుగుతాయని వైరా ఎంవీఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం వైరాలోని తమ కార్యాలయానికి వచ్చిన వాహన యజమానులు, డ్రైవర్లకు ఎంవీఐ టీజీతో రిజిస్ట్రేషన్ల విషయమై అవగాహన కల్పించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు టీఎస్‌తో వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిందని, ఇక నుంచి టీజీతో రిజిస్ట్రేషన్లు జరుగుతాయని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మార్చి 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్, మార్చి 15: ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలను మార్చి 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి సభ్యులచే ఆమోదింపజేసుకున్నారు. 2024-25 సంవత్సరానికి నూతన బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారిగా మారగాని శ్రీనివాసరావు, సహాయ ఎన్నికల అధికారులుగా కూరపాటి శేఖర్‌రాజు, రాయల పావెల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్లు పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహరణలు, పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 28న పోలింగ్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మొత్తం మహిళా ప్రతినిధితో పాటు ఏడు పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అధ్యక్ష పదవికి ముక్కోణపు పోటీ, కార్యదర్శి కి ద్విముఖపోటీ ఉండనున్నదని సమాచారం.

కట్టిన సొమ్ముకు రెట్టింపు ఇస్తామంటూ మోసం..

● రూ.20వేలు పోగొట్టుకున్న చెర్వుమాధారానికి చెందిన వ్యక్తి

నేలకొండపల్లి, మార్చి15: కట్టిన సొమ్ముకు రెట్టింపు ఇస్తామని ఫోన్ల ద్వారా నమ్మబలుకుతూ అమాయకులను మోసం చేస్తున్న సంఘటనలను నిత్యం వింటూనే ఉన్నాం. అలా రూ.25వేలు పంపితే రూ.75వేలు తిరిగిస్తామని చెప్పి మోసగించిన సంఘటన మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పేరబోయిన నరేష్ ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం తనకు 91635 71963 నెంబరు ద్వారా ఫోను వచ్చింది. తన పేరు రామకృష్ణారావుగా పరిచయం చేసుకున్నాడని, తమకు రూ.25వేలు పంపితే తిరిగి 24గంటల్లోనే రూ.75వేలు పంపిస్తామని చెప్పాడన్నారు. మూడు దఫాలుగా రూ.3,500, రూ.4,326, రూ.12,500 పంపానని, తర్వాత ఫోన్ చేస్తే ఇంకా రూ.8,500 పంపితేనే డబ్బులు తిరిగి పంపుతామంటున్నారన్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : ఏసీపీ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, మార్చి15: ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆటోడ్రైవర్లు, సంఘాలకు ట్రాఫిక్‌పై కల్పించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్టి లో పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం నియంత్రించేందుకు దృష్టిపెట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు రవి, వెంకన్న, ఆర్ఎస్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక సాధికారత ఇదేనా..?

» బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలో 31వ స్థానంలో ఖమ్మం జిల్లా » 18వ స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా » సెర్ఫ్ ఉద్యోగులతీరుతో రుణాలకు ముందుకు రాని ఎస్‌హెచ్‌జీలు



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 15: మహిళలు డబ్బుల కోసం దళారులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఆత్మ గౌరవంతో బ్యాంకుకు వెళ్లి అప్పు తెచ్చుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బ్యాంకు లింకేజీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. జిల్లా స్థాయిలో బ్యాంకు లింకేజీ డీపీఎం అధికారిని ఏర్పాటు చేసి రుణాల లక్ష్యాలను ఏర్పాటు చేసి బ్యాంకర్లతో మాట్లాడి ఏడాది కాలానికి మహిళలకు రుణాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రతి సంవత్సరం లక్ష్యానికి మించిన స్థాయిలో రుణాలను అందించి ప్రథమ స్థానంలో నిలుస్తూ వచ్చిన ఖమ్మం జిల్లా... ఈ ఏడాది మాత్రం రాష్ట్రంలోనే చివరి స్థానానికి చేరుకొంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 18వ స్థానంలో నిలిచి ఫర్వాలేదనిపించింది.

ఖమ్మంలో 73శాతంతో వెనకడుగు..

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో 1,018 గ్రామ సమాఖ్యల ద్వారా 25,051మహిళా స్వయం సహాయక సంఘాలు నడుస్తున్నాయి. వీటిలో 2,02,021 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. 2023 నుంచి 2024 బ్యాంకు లింకేజీ వార్షిక టార్గెట్‌ను 16,642 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.931కోట్ల 68లక్షల 82వేల టార్గెట్ ఇచ్చారు. కాని ఇప్పటి వరకు 12,091 ఎస్‌హెచ్‌జీలకు రూ.683కోట్ల 52లక్షల 51వేలు మాత్రమే అందించారు. 73.36శాతంతో 31వ స్థానంలోకి చేరింది. ప్రతి ఏడాది టార్గెట్‌కు మించిన స్థాయిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బ్యాంకు లింకేజీలు జరిగి మొదటి ఐదు స్థానాల్లోపుగా ఉండేవి. వార్షిక బ్యాంకు లింకేజీ గడువు ముగింపు రోజులకు వచ్చినా కూడా బోనకల్ 54శాతం, తిరుమలాయపాలెం 58శాతం, పెనుబల్లి 59శాతం, కొణిజర్ల 60శాతం, కల్లూరు 65శాతం, కూసుమంచి 72శాతం, ఏన్కూరు 76శాతం, కామేపల్లి 79శాతం, ముదిగొండ 79, మధిర 85శాతంతో రాష్ట్రంలోనే చివరిస్థాయిలో చేరిన మండలాలకు చేరాయి. కాగా వెంసూరు 104శాతం, సింగరేణి 100శాతం, వైరా 99శాతంతో నిలిచాయి.

కొత్తగూడెంభద్రాద్రిలో 95శాతం

కాగా నూతనంగా ఏర్పాటైన జోగులాంబ గద్వాల జిల్లా 111.73శాతంతో ప్రథమస్థానంలో ఉంది. పక్కన ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10,527 ఎస్‌హెచ్‌జీలకు రూ.380కోట్ల 96లక్షల 87వేలు లక్ష్యానికి గాను 7,275 సంఘాలకు రూ.362కోట్ల 78లక్షల 28వేలు రుణాలను అందించి 95శాతం పూర్తి చేసి 18వ స్థానంలో నిలిచింది. ఖమ్మం జిల్లా మాత్రం చివరి నుంచి రెండో స్థానం 31లోకి చేరింది. మరో పక్షం రోజుల్లో వార్షిక బ్యాంకు రుణ కార్యచరణ ముగియనుంది.

అవగాహన కల్పించడంలో విఫలమైన అధికారులు

ప్రజల ఆర్థిక అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం క్యాష్ క్రెడిట్ లిమిట్ ప్లాన్‌ను బ్యాంకు లింకేజీలకు ఏర్పాటు చేసింది. గతంలో ఓ సభ్యురాలు రూ.2లక్షలు బ్యాంకు లింకేజీ తీసుకుంటే మొత్తం డబ్బులు చెల్లించే వరకు తిరిగి బ్యాంకులో అప్పులు ఇచ్చే వారు కాదు. కానీ క్యాష్ క్రెడిట్ లిమిట్ మేరకు ఓ సభ్యురాలు బ్యాంకు లింకేజీ తీసుకున్న ఆరు మాసాల తర్వాత తాను చెల్లించిన మొత్తంలో అప్పటి వరకు వడ్డీ పోను మిగిలిన సొమ్మును రుణంగా పొందేందుకు బ్యాంకు లింకేజీలో వెసులుబాటు కల్పించారు. ఇలా ఎన్నిసార్లైనా వ్యక్తిగతంగా మహిళ సభ్యులు రుణం తీసుకొనే వీలు ఉంది. ఈ విషయాన్ని బ్యాంకు లింకేజీ అధికారులు ఎస్‌హెచ్‌జీలకు అవగాహన కల్పించలేక పోయారు. నాడు సంఘాల నిర్వాహణ, బ్యాంకు లింకేజీ, తిరిగి చెల్లింపుల్లో ఖమ్మం జిల్లా ఆదర్శవంతంగా కొనసాగేది. జాతీయ స్థాయిలో పలు అవార్డులను కైవాసం చేసుకొంది. ప్రతి రుణానికి గ్రామ దీపికలు ఫిక్స్‌డ్ డబ్బులు వసూళ్లు చేయడంతో ధర్నాలు జరిగాయి. ఘనమైన ఖ్యాతీ పొందిన ఖమ్మం జిల్లా ఇప్పుడు రాష్ట్రంలోనే అథమ స్థాయిలోకి చేరింది.

ఇతర కార్యక్రమాల వల్ల జిల్లా వెనుకబాటు: పద్మ, డీపీఎం, బ్యాంకు లింకేజీ

బ్యాంకు లింకేజీ చేయాల్సిన మా లాంటి అధికారులకు ఇతర బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఈ రోజు కూడా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు బ్యాంకు విధులు కేటాయించారు. ఇతర జిల్లాల్లో టార్గెట్ తక్కువగా ఉండటంతో ముందున్నాయి. ఖమ్మం జిల్లా టార్గెట్ ఎక్కువగా ఉండటంతో వెనుకబాటుకు గురైంది. మా ప్రయత్నం మేం చేస్తున్నాం.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

● రూ.4.20 కోట్లతో అభివృద్ధి పనులు

● ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్



మాట్లాడుతున్న ఎస్ఈ రమేష్

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 15: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.4.20కోట్లతో జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆపరేషన్ సర్కిల్ ఎన్‌పీడీసీఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమేష్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. జిల్లాలో అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, కొత్త కెపాసిటర్లు, విద్యుత్ నియంత్రికల ఏర్పాట్లు చేశామన్నారు. రూ.2.90 కోట్లతో అదనపు 33/11 కెవిలైన్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.30లక్షలతో మణుగూరు మండలంలోని గుట్టమల్లారం సబ్ స్టేషన్‌లో 3.15 ఎంవిఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్, రూ.40లక్షలతో చంద్రుగొండ మండలంలోని పోకలగూడెం సబ్ స్టేషన్‌లో 5.0 ఎంవిఏ అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్, రూ.40 లక్షలతో మణుగూరు మండలంలోని మణుగూరు సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీని 3.15 ఎంవిఏ నుంచి 5.0 ఎంవిఏకు పెంచడం, రూ.60 లక్షలతో దమ్మపేట మండలంలోని నాగులపల్లి సబ్‌స్టేషన్‌లో 5.0 ఎంవీఏ నుంచి 8.0ఎంవిఏకు పెంచడం, రూ.40లక్షలతో భద్రాచలం మండలంలోని భద్రాచలం సబ్‌స్టేషన్‌లో 5.0 ఎంవిఏ అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను, రూ.40లక్షలతో కొత్తగూడెం మండలంలోని ప్రగతినగర్ సబ్ స్టేషన్‌లో 5.0 ఎంవిఏ అదనపుట్రాన్స్‌ఫార్మర్, రూ.40 లక్షలతో పాల్వంచ మండలంలోని ఇందిరానగర్ కాలనీ సబ్‌స్టేషన్‌లో 5.0ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. రూ.52లక్షలతో రెండు కొత్త కెపాసిటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజి సమస్యను అధిగమించేందుకు, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిని ఏర్పాటు చేశామన్నారు. రూ. 44 లక్షలతో జిల్లాలోని 33/11 కెవి సబ్ స్టేషన్లలో 65 కెపాసిటర్లను ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా నాలుగు కెపాసిటర్లను 33/11 కెవి సబ్ స్టేషన్లలో ఏర్పాటు చేయడం జరిగిందని మరో ప్రశ్నకు సమాదానం ఇచ్చారు. 11కెవి లైన్ నందు 40 కెపాసిటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా 8 కెపాసిటర్లను 11 కెవిలైన్ నందు ఏర్పాటు చేశామని అందుకు రూ.8 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ 78 లక్షలతో జిల్లాలో 26 విద్యుత్ నియంత్రికల ను ఏర్పాటు చేశామన్నారు. దీంతో వచ్చే వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక





హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రోహేలా, ఉపేందర్

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 15: దాద్రానగర్ హవేలిలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నగర క్రీడాకారులు సీనియర్స్ విభాగంలో ఎ.రోహేలా, జూనియర్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీలకు సీహెచ్. ఉపేందర్‌లు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు. జాతీయ పోటీలలోరాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

చేప పిల్లల పెంపకంపై అవగాహన

ఖమ్మం రూరల్, మార్చి 15: మండల పరిధిలోని మంగళగూడెం గ్రామంలోని ఆర్ఏఎస్ చేప పిల్లల పెంపకం యూనిట్‌ను శుక్రవారం వ్యవసాయాధికారి విజయనిర్మల, మత్స్యశాఖ ఏడీఏ ఆంజనేయస్వామిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేప పిల్లల పెంపకం, యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు అరుణజ్యోతి, శరత్‌బాబు, లక్ష్మణ్, ఏఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల గర్జన సభను జయప్రదం చేయాలి

● గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం

కొణిజర్ల, మార్చి15: గిరిజన హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న గిరిజన హక్కుల గర్జన సభను విజయవంతం చేయాలని గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం పిలుపునిచ్చారు. శుక్రవారం కొణిజర్లలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ పోరాట యోధుడు ధానునాయక్ 74వ వర్ధంతి సభ సందర్భంగా గిరిజన గర్జనసభ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇల్లులేని గిరిజన ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మొదటి ప్రాధాన్యతలో కల్పించాలని, పోడు రైతులకు గిరి వికాస్ పథకం కింద బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తేజావత్ కృష్ణకాంత్, బానోతు హరిచంద్, సీత రాములు, నంద్యానాయక్, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 108 పైలెట్ శిక్షణ



ప్రశంసా పత్రం అందుకుంటున్న రామకృష్ణ

నేలకొండపల్లి, మార్చి15: కొత్తగూడెం జిల్లాలో గురువారం నిర్వహించిన 108 అంబులెన్స్ పైలెట్ల శిక్షణలో నేలకొండపల్లి 108 అంబులెన్స్ పైలెట్ పాలడుగు రామకృష్ణ మొదటి స్థానంలో నిలిచాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా 108 అంబులెన్స్‌ల పైలెట్ల ట్రైనింగ్‌లో ప్రథమస్థానం పొందిన రామకృష్ణను పలువురు సహచరులు అభినందించారు. జిల్లా మేనేజర్ భూమా నాగేంద్ర అతడిని అభినందించడంతో పాటు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈ ప్రణయ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు..

రేషన్ దందా..

» తెలంగాణ నుంచి ఏపీకి తరలిపోతున్న రేషన్ బియ్యం

» సరిహద్దుల్లో కొరవడిన నిఘా

» పట్టించుకోని అధికారులు

అశ్వారావుపేట, మార్చి15: తెలంగాణలో రేషన్ దందా భారీ ఎత్తున జరుగుతోంది. రోజూ రూ.వందల కోట్ల అక్రమ రేషన్ బియ్యం యథేచ్ఛగా జరిగిపోతోందని సమాచారం. ఈ రేషన్ బియ్యం దందాలో ఆంధ్రాకు చెందిన వ్యాపారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అడపాదడపా రేషన్ బియ్యం పట్టుబడుతున్నా.. అధికారుల కళ్లు గప్పి సరిహద్దులు దాటిపోయే బియ్యమే ఎక్కువ ఉంటుందని అంచనా..

తెలంగాణ నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో రేషన్ బియ్యం లారీలల్లో సరిహద్దులు దాటి ఏపీలోని పోర్టులకు వెళ్లి పోతున్నాయి. అక్కడ నుంచి విదేశాలకు భారీ ఎత్తున తరలిపోతాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కాగా ఇటీవల దమ్మపేట మండలం, ముష్టిబండ వద్ద 198 క్వింటాళ్ల రేషన్ బియ్యం టాస్క్‌పోర్సు తనిఖీల్లో పట్టుబడింది. అదే విధంగా ఏపీ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. దీంతో అశ్వారావు పేట, దమ్మపేట, సత్తుపల్లి ప్రాంతాల గుండా ఆంధ్రాకు రేషన్ బియ్యం తరలిపోతుందని సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు దళారులు, అధికారుల పాత్ర కూడా ఉండవచ్చుననే ఆరోపణలు వస్తున్నాయి.

రేషన్ దుకాణాల కొనుగోలు చేస్తున్నవైనం

ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని సామాన్యులు కూడా ఆహారంగా తీసుకోవడం లేదు. కొందరు ఆ బియ్యాన్ని రేషన్ దుకాణాల వద్దే అమ్మేస్తున్నారు. దీంతో కొందరు దళారులు రంగంలోకి దిగి రేషన్ బియ్యాన్ని చిరువ్యాపారుల దాదా కిలో రూ.10ల చొప్పున సేకరిస్తున్నారు. ఎక్కడికక్కడ లారీలలోకి లోడు చేసి ధాన్యం, అపరాల వేబిల్లుల మాటున ఏపీకి తరలించి వేస్తున్నారు. పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం అడ్డదారిన వెళ్తూ వ్యాపారులు రూ. కోట్లలో దండు చేసుకుంటున్నాయి. గ్రామాల్లో తనిఖీలను ముమ్మరం చేసి రేషన్ దందాకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ (ఫైల్)



ముత్యాలరావు కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండెపోటుతో వ్యక్తి మృతి

మణుగూరు, మార్చి 15: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు తిరుమల్లేష్ కుమారుడు పల్లపు ముత్యాల రావు(35) గుండెపోటుతో శక్రవారం మృతి చెందాడు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అయోధ్య, దుర్గాల సుధాకర్, జంగం మోహన్ రావు, పలువురు తిరుమల్లేష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జ్వరంతో యువకుడు....



శ్రీకాంత్

చర్ల, మార్చి 15: మండలంలోని కేశవాపురం గ్రామానికి చింతా శ్రీకాంత్ (28) కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో ఓ గ్రామీణ వైద్యుడి దగ్గర వైద్యం చేయించుకున్నట్లు తెలుస్తోంది. జ్వరం తగ్గకపోగా, గురువారం పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా గ్రామాల్లో పారిశుధ్య లోపంతోనే ప్రజలు జ్వరాల భారీన పడుతున్నారని పేర్కొంటున్నారు. పలువురికి జ్వరాల తీవ్ర త ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాలుగు దుకాణాల్లో చోరీ

అశ్వారావుపేట, మార్చి 15: పట్టణంలో గురువారం రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ జరిగిన సంఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులోని విక్టరీ సూపర్ మార్కెట్‌లో రూ.9వేలు నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. పక్కనే ఉన్న దుర్గ సూపర్ మార్కెట్‌లో రూ.3వేల నగదు, దానికి ఎదురుగా ఉన్న చీమకుర్తి సతీష్, మరో కూరగాయల దుకాణంలో చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ సంఘటనలు సీసీ కెమెరాలలో నిక్షిప్తమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం ద్వారా తనిఖీలు చేపట్టారు.

ఆలయంలో చోరీకి యత్నం

జూలూరుపాడు, మార్చి 15: మండలంలోని పాపకొల్లు గ్రామంలో కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 13న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి హుండీతాళాలు పగులకొడుతున్న సమయంలో ఆ శబ్దాన్ని గ్రహించి గ్రామస్థులు రావడం చూసి పారిపోయాడు. 14న ఉదయం ఆలయ కార్యనిర్వహణ అధికారి నల్లమోతు శేషయ్య చోరీ సంఘటనపై ఎస్ఐ జీవన్‌రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీలు, ట్రాక్టర్లు సీజ్

పాల్వంచ, మార్చి 15: మండల పరిధిలోని తోగ్గూడెం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న మూడు లారీలు, నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్టేషన్‌కు తరలించారు. ఆయా వాహనాలకు సంబంధించిన యజమానులు డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని పాల్వంచ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గేదె విషయంలో గొడవ..

వివాహిత ఆత్మహత్య

తల్లాడ, మార్చి 15: గేదె విషయంలో భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవరం గ్రామానికి చెందిన కటికి రాగిని(29)కి 2017లో అదే గ్రామానికి చెందిన కటికి వీరస్వామితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. వీరు 15 రోజుల క్రితం గేదెను కొనుగోలు చేశారు. ఈ విషయమై భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన ఆమె ఈనెల 13న పుట్టింటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఆమెను ఇంటికి తీసుకురాగా కన్నుమూసింది. మృతురాలి తండ్రి ఎర్రి రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి....

పాల్వంచ, మార్చి15: మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామ పంచాయతీలోని పెద్దకలశ గ్రామానికి చెందిన మలకం దేవ(40) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం చింతచెట్టుపై నుంచి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భీమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు పనుల అడ్డగింత



రోడ్డు పనులు అడ్డుకున్న దృశ్యం

తిరుమలాయపాలెం, మార్చి 15: మండలంలోని మేడిదపల్లి గ్రామంలో ఈజీఎస్ కింద మంజూరైన రోడ్డు పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారని శుక్రవారం బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు పనులను అడ్డుకున్నారు మండలంలోని మేడిదపల్లికి ఈజీఎస్ పథకం కింద ప్రభుత్వం రూ.15లక్షల సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రా మానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పనులు చేపడుతుండగా సీపీఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. గ్రామసభలో తీర్మానం చేయకుండా పనులు ఎలా చేపడుతున్నారని చేయవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం గ్రామస్థులు ఎంపీడీవోకు , ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయులు, లచ్చిరెడ్డి, బండ్ల విజయ్, ఉప్పలయ్య, వెంకటేష్, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'



ఖాళీ కుర్చీలను చూపిస్తున్న సీపీఐ నాయకులు

ములకలపల్లి, మార్చి15: సమయానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి ఎండి. యూసుఫ్ అన్నారు. శుక్రవారం ములకలపల్లి కేంద్రంలో ఉన్న రహదారులు, భవనాలశాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుకు కార్యాలయం ఇక్కడ ఉంది కాని, అధికారులు ఏనాడూ అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొందన్నారు. మండలంలో సంబంధిత శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే పని ప్రదేశంలో ఉండి పని పర్యవేక్షించాల్సిన అధికారులు లేక, కనీసం కార్యాలయానికి రాని డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

9 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ రాంమ్మూర్తి

మధిర, మార్చి 15: సికింద్రాబాద్ వైపు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా రవాణా అవుతున్న 9కిలోల గంజాయిని శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని సీజ్‌చేశారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు అప్రమత్తం అయిన ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కోణార్క్ రైలు మధిర రాగానే రైలెక్కి మధిర నుంచి ఖమ్మం వరకు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా 9కిలోల బరువు కలిగిన 6గంజాయి ప్యాకెట్లు లభించాయి. అయితే వీటికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ పట్టుబడలేదు. ఈమేరకు గంజాయిని స్వాదీనంచేసుకొని కేసునమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాంమ్మూర్తి తెలిపారు. దీని విలువ రూ.2.5లక్షలు ఉంటుందని తెలిపారు. ఈతనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ జనార్దన్‌రెడ్డి, సిబ్బంది ముస్తఫా, గోపయ్య, లాలూ, నాగరాజు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

కరకగూడెం, మార్చి 15: మండలంలోని రేగళ్ల గ్రామానికి చెందిన మడకం రాంబాబు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని మణుగూరు వైద్యశాలకు తరలించారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు...

నేలకొండపల్లి, మార్చి15: నేలకొండపల్లికి చెందిన సాగి రవి తన భార్య వెంకటరమణతో కలిసి ద్విచక్రవాహనంపై కోదాడ నుంచి నేలకొండపల్లి వస్తుండగా, పైనంపల్లి వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఉన్న వెంకటరమణ కిందపడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

ఇక 'అమ్మ'లాలన..పాలన

- బడుల బలోపేతానికి 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లు
- కలెక్టర్ ఆదేశాలతో ఖాతాలను తెరిచిన ఉపాధ్యాయులు
- ఎస్ఎంసీల మాదిరిగానే కమిటీలో 15 మంది
- పూర్తిగా మహిళల భాగస్వామ్యంతోనే బడుల్లో పనులు

బోనకల్, మార్చి 15: పాఠశాలల బలోపేతం కొరకు ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను' ప్రతీ బడిలో ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. పాఠశాలల్లో ఏర్పాటు చేసే నూతన కమిటీకి సంబంధిత గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమిటీ చైర్మన్‌గా, హెచ్ ఎం మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించాలి. వీరిద్దరూ సంయుక్తంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో బ్యాంకులో ఖాతాలను తెరిచి వెంటనే జిల్లా కేంద్రానికి సమాచారాన్ని పంపాలి. దీంతో ఖమ్మం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో హెచ్ఎంలు, మహిళా సమాఖ్య అధ్యక్షులు శుక్రవారం బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. డీఆర్‌డీవో నుంచి ఐకేపీ కార్యాలయానికి కమిటీలకు సంబంధించి ఖాతాలను తెరిపించేలా చూడాలని ఆదేశాలు రావడంతో సిబ్బంది పాఠశాలలను సందర్శించారు. డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, హెచ్ఎంలను సమన్వయ పరిచి ఖాతాలను తెరిపించారు.


బ్యాంకు ఖాతాలు తెరిచే పనిలో ఉన్న ఉపాధ్యాయులు

ఎస్ఎంసీల మాదిరిగానే కమిటీలలో 15 మంది

ఇప్పటి వరకు అమలైన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల మాదిరిగానే నూతనంగా ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల్లో కూడా 15 మంది సభ్యులు ఉంటారు. ప్రతి తరగతిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది పేర్లు, వారి వివరాలను పొందుపరచాలి. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రుల్లో డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలను మాత్రమే తీసుకోవాలి. గతంలో ఎస్ఎంసీ ఎన్నికల్లో మాత్రం తరగతికి ముగ్గురు చొప్పున ఎన్నుకొన్న మొత్తం 15 మందిలో ఒకరిని సభ్యులు చైర్మన్‌గా ఎన్నుకునే వారు. కాని ప్రస్తుత కమిటీలలో మాత్రం సభ్యులతో సంబంధం లేకుండానే నేరుగా గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిని చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాల ఎకౌంట్లకు సంబంధించి హెచ్ఎం, సీనియర్ ఉపాధ్యాయుడు సంయుక్తంగా లావాదేవీలను నిర్వహించాలి. కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో తెరిచే ఎకౌంట్లు మాత్రం హెచ్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లావాదేవీలను నిర్వహించాలి.

పూర్తిగా మహిళల భాగస్వామ్యంతోనే...

ఇక నుంచి బడుల్లో నిర్వహించే పనులన్ని మహిళల భాగస్వామ్యంతోనే నడిచేలా ప్రభుత్వం కమిటీల రూపకల్పనకు మార్గదర్శకాలను జారీ చేసింది. స్వయం సహాయక సంఘాల సభ్యులను కమిటీలలో తీసుకొని పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేసింది. మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో భాగస్వామ్యం కల్పించి మెరుగైన ఫలితాలను రాబట్టే అవకాశం ఉంటుందని భావించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు రూపకల్పన చేసింది. వీటికి సంబంధించి ప్రత్యేకమైన నిధులను కూడా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎస్ఎంసీలను మరిపించే విధంగా కొత్త కమిటీల పని విధానం ఉండాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

వసతుల కల్పన బాధ్యత కమిటీలదే

- కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 14: యూడైస్ డేటా ప్రకారం జిల్లాలో గుర్తించిన ' అమ్మ ఆదర్శ పాఠశాలల్లో' మౌలిక వసతుల కల్పన బాధ్యత పాఠశాల కమిటీలదేనని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపిడీవోలు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 697 పాఠశాలల్లో అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ 22.69 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత లోపానికి ప్రధానోపాధ్యాయులు, కమిటీ అధ్యక్షులే బాధ్యత వహించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని మౌలిక వసతులతో పాఠశాలలు కళకళలాడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీఈవో వెంకటేశ్వరచారి, వివిధ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, మార్చి 15: గిరిజన నిరుద్యోగ యువత సింగరేణి సంస్థ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో గల మేనేజ్‌మెంటు ట్రైనీ, జూనియర్ అసిస్టెంట్, ఫారెస్టు ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ కోరారు. ఈ నెల 18వ తేదీ వరకు రూ.100 ఫీజు చెల్లించి ఎస్‌సిసిఎల్‌మైన్స్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆర్టీసీ ఈయూ రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 15: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలను శని, ఆదివారాల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు తెలిపారు. శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు వస్తారని వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలే ఏజెండాగా రాష్ట్ర మహాసభలల కార్యాచరణ చేశామన్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకన్న, రాష్ట్ర నాయకులు రామారావు, పాటి అప్పారావు, పిల్లి రమేశ్, తోట రామాంజనేయులు, బుచ్చిబాబు, బీవీ రెడ్డి పాల్గొన్నారు.

డీసీసీబీ అంచనా బడ్జెట్ ఆమోదం



ప్రసంగిస్తున్న డీసీసీబీ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 15: 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం 124వ మహాజనసభ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలోని టీఎస్ ప్రసాద్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ మహాజనసభలో గత మహాజనసభ తీర్మానాలను ధ్రువీకరించి గత ఆర్థ సంవత్సరపు నివేదికను ఆమోదించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సంఘములకు అందిస్తున్న సేవలకు అనుగుణంగా బ్యాంక్ బైలాను సవరించి ఆమోదించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో అబిద్ ఉర్ రెహమాన్, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు, సహకారేతర అనుబంధ సంఘ అధ్యక్షులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ల నియామకం వాయిదా

డీసీసీబీలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ల నియామకం కోసం ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడింది. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం ఖమ్మం డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఖాళీగా ఉన్న నాలుగు డీసీసీబీ డైరెక్టర్లను నియామకం ఎజెండాతో ప్రకటించారు. అయితే ఎస్సీ, బీసీ డైరెక్టర్ల పేర్లు ఖరారు కాకపోవటంతో వారం రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఇదే సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పదవికీ నోటిఫికేషన్ ఇవ్వాలని పలువురు డైరెక్టర్లు కోరారు. ముందుగా పూర్తి స్థాయిలో డైరెక్టర్ల నియామకం జరిగిన తర్వాత చైర్మన్ పదవికి నోటిఫికేషన్ ఇవ్వాలని చర్చలు అనంతరం తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీవో మురళీధర్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శిశుగృహంలో చిన్నారికి ఆశ్రయం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 15: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శిశుగృహంలో ఏడు నెలల పాపకు ఆశ్రయం కల్పించామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పాపకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు 30రోజుల్లోపు తగిన ఆధారాలతో సంప్రదించితే పాపను అప్పగిస్తామని తెలిపారు. లేకుంటే నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు.

బీజేపీ ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి


మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి15: రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగనుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లాబార్థి సంపర్క్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన లాబార్థి సంపర్క్ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, నరేంద్రమోదీ అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కో కన్వీనర్ తాండ్ర వినోదరావు, నున్న రవికుమార్, భూక్యా శ్యాంసుందర్, మంద సరస్వతి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నెల్లూరి కోటేశ్వరావు, ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

'చలో కలెక్టరేట్' లో..

ఉద్రిక్తత

- వర్సిటీ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ పిలుపు
- విద్యార్థుల పదర్శన, అడ్డుకున్న పోలీసులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 15: ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులతో కలిసి సంఘం జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో రఘునాథపాలెం సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థులను రోప్‌తో అడ్డుకున్నారు. విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకొంది. అనంతరం జిల్లా అధికారులకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాగుల్‌మీరా, చందులాల్, సురేశ్, ప్రతాపు, రాకేష్, రాజు, అయ్యప్ప, నరేశ్, గోపి, సాయి, ఉమామహేష్, పావని. రజిత, లలితకుమారి పాల్గొన్నారు.


విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- చైతన్య కాలేజీలో రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు
- ఓటర్ల జాబితా సిద్ధం
- 29,740 ఓట్ల బోగస్ ఓట్ల తొలగింపు
- కలెక్టర్ వీపీ గౌతమ్



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 15: 'రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం.. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తయింది.. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. ఈవీఎంల మెదటి విడత పరిశీలన, పోలింగ్ సిబ్బందికి అధికారులకు శిక్షణ పూర్తి చేశాం... ఈసారి బోగస్ ఓట్లకు ఆస్కారం లేకుండా జాబితాను సిద్ధం చేశాం..' అని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ విడుదల కానున్నదని భావిస్తున్న నేపథ్యంలో ఆయనను సంప్రదించగా, పలు వివరాలు తెలిపారు. అవి ఆయన మాటల్లోనే..

ఖమ్మం ఎంపీ సీటు పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. ఖమ్మం జిల్లాలో ఓటర్ల జాబితాను సిద్ధం చేశాం. కొత్త ఓటర్ల చేర్పులు కూడా ముమ్మరంగా చేపట్టాం. జిల్లాలో 29,740 ఓటర్లను చనిపోయిన, వసలపోయిన, రెండేసి ఓట్లు ఉన్న వారిగా గుర్తించాం. వారికి బీఎల్వోల ద్వారా నోటీసులు ఇప్పించి ఫారం 7 ద్వారా తొలగించాం.

- పార్లమెంట్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఏఆర్వోలుగా మునిసిపల్ కమిషనర్, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు, ఎస్‌డీసీ రైల్వేపీపీటీ, డీఆర్డీవో, జడ్పీ సీఈవో వ్యవహరించనున్నారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన రెండు సెగ్మెంట్లలో కొత్తగూడెం ఆర్డీవో, అదనపు కలెక్టర్ ఏఆర్వోలుగా వ్యవహరించనున్నారు. వీరందరికీ ఇప్పటికే రెండు మార్లు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాం.

- ఖమ్మం పార్లమెంట్ పరిధిలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ (ఐడీఓసీలో) చాంబర్‌లో నిర్వహించనున్నాం. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగానే అనుమతులు, డిస్ట్రిబ్యూషన్, ఈవీఎంల పంపిణీ పోలింగ్ సిబ్బంది నియామకం చేపట్టనున్నాం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సదుపాయాలు, సౌకర్యాలు, పోలింగ్ నిర్వహణ తదితర కార్యక్రమాలన్నీఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నిర్వహించనున్నాం. పోలింగ్ తర్వాత పోలింగ్ సిబ్బంది మాత్రం అన్ని సెగ్మెంట్ల నుంచి ఖమ్మంలోని తల్లంపాడు చైతన్య కళాశాలలో రిసెప్షన్ కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. అక్కడే స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రకారం కౌంటింగ్‌ను నిర్వహించనున్నాం. మొత్తం 7 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశాం. దీంతో పాటు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం మరో లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

- నోడల్ అధికారుల నియామకం పూర్తయ్యింది. ఏఆర్వోలకు, సెక్టార్ ఆఫీసర్లకు, కలెక్టరేట్ సిబ్బందికి, ఐటీ సెక్టార్, అధికారులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశాం. 146 ఈవీఎంలను పోలింగ్ సిబ్బందికి శిక్షణ కోసం సిద్ధంగా ఉంచాం. కలెక్టరేట్ కొత్తగా నిర్మించిన ఈవీఎం గోదాముల్లో ఈవీఎంలను భద్రపరిచాం. ఇప్పటికే మొదటి విడత పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాం.

- సీసీ కెమెరాల ఏర్పాటు

గత అసెంబ్లీ పోలింగ్ దృశ్యాలను అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల ద్వారా కలెక్టరేట్‌కు అనుసంధానం చేసి ఇబ్బందులు తలెత్తకుండా చేశాం. మన జిల్లాలో అమలు చేసిన విధానాన్ని అన్ని చోట్ల అమలు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇది మన జిల్లాకు గర్వకారణం. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే తరహాలో సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తాం. పోలింగ్ కేంద్రాల్లోనూ వసతుల కల్పనలోనూ మన జిల్లా ఆదర్శంగా నిలిచింది.

సెక్టార్ అధికారులు విధుల పట్ల అవగాహన పెంచుకోవాలి

ఖమ్మంకలెక్టరేట్ మార్చి 15: సెక్టార్ అధికారులు తమ విధులు, బాధ్యతల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల సంఘ నియమ, నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. సెక్టార్ అధికారుల విధులు మూడు అంచెలుగా ఉంటాయని, పోలింగ్‌కు 72 గంటల ముందు, పోలింగ్‌కు ఒక రోజు ముందు, పోలింగ్ రోజున విధులు కీలకమని అన్నారు. గడచిన ఎన్నికల్లో 10 శాతం కంటే తక్కువ పోలింగ్, 90 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగి, ఒకే అభ్యర్థికి 75 శాతం కంటే ఎక్కువ ఓట్లు పోలయిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ ప్రక్రియ ఆగిన కేంద్రాలు, ఏఎస్‌డీ జాబితా అసాధారణంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సి-విజిల్ యాప్ పై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈవీఎంల రవాణా జాగ్రత్తగా చేయాలని, జీపీఎస్ ఉన్న క్లోస్డ్ వాహనంలో, ఎస్కార్ట్‌తో పాటు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ మౌనిక, అదనపు డీసీపీ జి. ప్రసాదరావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె. శ్రీరామ్, ఆర్డీవోలు, ఏసీపీలు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశ్యంతోనే

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర



సత్తుపల్లి, మార్చి15: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు రాజకీయ దురుద్ధేశ్యంమేనని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో విమ్మర్శించారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పుడే ఎలా అరెస్ట్ చేస్తారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల ముంగిట ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు. ఈడీ అధికారులు చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నార న్నారని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై బీఆర్ఎస్ పార్టీని బలహీన పరిచేందుకు పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఉద్దేశపూర్వకంగా అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ రేపు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 15: 2024-25 విద్యా సంవత్సరంలో 100 మంది మైనారిటీ అభ్యర్థులకు యూపీఎస్సీ, సిఎస్ఏటీ-25 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ మహమూది శుక్రవారం తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించామన్నారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 12 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందించాలని తెలిపారు. ఏప్రిల్ 28న అన్ని జిల్లా కేంద్రాలలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని మైనారిటీ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విరాళాలకు కంప్యూటరైజ్డ్ బాండ్లు

భద్రాచలం, మార్చి 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించే భక్తులు నగదు, చెక్, ఆన్‌లైన్ ద్వారా రూ.1,116లు ఆపై సమర్పించే విరాళాలకు ఇక నుంచి కంప్యూటరైజ్డ్ బాండ్లు ఇచ్చే పద్ధతిని అమలు చేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రకటించారు. ఇప్పటి వరకు విరాళాలు అందజేసిన వారికి రసీదు చేతిరాతగా ఇచ్చేవారని ఇక నుంచి శాశ్వత పూజలు, ఇతర విరాళాలకు బాండు రసీదు కంప్యూటరైజ్డ్‌గా ఇస్తామని తెలిపారు. ఇదిలా హనుమాన్‌చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించే మహిళలకు రూ.100 ప్రత్యేక దరన్శనం క్యూలైన్ ద్వారా ఉచితంగా దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉత్సవాలు, విశేష దినాలు, ప్రముఖులు వచ్చిన రోజుల్లో ఈ అవకాశం ఉండదని తెలిపారు.

'కు.ని.'కి పాట్లు..

- నిలిచిపోయిన ప్రసవ సేవలు
- పీహెచ్‌సీ, వందపడకల దవాఖానాల్లో అందని వైద్యం
- సరిపోను సంఖ్యలోలేని గైనకాలజిస్టులు


మణుగూరు ఏరియా ఆసుపత్రి

మణుగూరు, మార్చి 15: మణుగూరు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సేవలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. మణుగూరు మునిసిపాలిటీ పరిధిని శివలింగాపురం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, సిజేరియన్లు చేయడం లేదు. పట్టణంలోని ఉన్న 100 పడకల ఆసుపత్రిలో గతంలో ఇద్దరు గైనకాలజిస్టులు ఉండగా ఒక్కరే ఆపరేషన్లు చేసే వారు. కాగా ఆరు నెలల క్రితం ఆయన మృతి చెందడంతో మరో వైద్యుడు గైనిక్ కేసులు పరీక్షలకే పరిమితం అయ్యారు. దీంతో దీంతో ప్రసవాలు, కుని, ఆపరేషన్లు బంద్ అయ్యాయి. ప్రజాప్రతినిధులు డీఎంహెచ్‌వో దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి మరో గైనకాలజిస్టును నియమించాల్సి ఉంది.

ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలు

మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ సేవలు ఆరు నెలలుగా అందడం లేదు. ఆర్థిక స్థామత లేక అప్పులను చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కో ఆపరేషన్‌కు రూ. 20 వేల నుంచి రూ. 35 వేల వరకు బిల్లులు చెల్లించాల్సి రావడంతో నిరుపేదలకు భారంగా మారింది. ఈ విషయంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వైద్యులను, తగిన సదుపాయాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు ఒంటిపూట వర్తించదా!?



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కల్లూరు, మార్చి 15: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ప్రతీ ఏడాది మార్చి నెల 15 వ తేది నుంచి ఒంటి పూట బడులు నిర్వహించేలా తగిన నిర్ణయం తీసుకొని ముందస్తుగా ఆదేశాలు జారి చేస్తుంది. ఆ క్రమంలోనే ఏ సంవత్సరం విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ఆదేశాలు అందాయి. దీంతో శుక్రవారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహించటం ఆరంభమైంది. కానీ మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గల పిల్లలకు మాత్రం ప్రభుత్వం ఒంటి పూట బడుల నుంచి మినహాయించారు. అసలే మార్చి నెల ఆరంభమైందంటే పగటిపూట ఎండ తీవ్రత వలన చిన్నారులు కేంద్రాలకు రావాలన్న నానా ఇబ్బందులు పడుతుంటారు. ఈ కేంద్రాలకు వచ్చే వారిలో ప్రధానంగా 3 నుంచి 6 సంత్సరాలలోపు గల పిల్లలే. వారికి గాను ఆట పాటల ద్వారా పూర్వప్రాథమిక విద్యను అందిస్తారు. దానితో పాటుగా పోషక ఆహారం అందిస్తారు. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు సేవలు అందిస్తారు. ఇలా ఖమ్మం జిల్లాలో ఐసీడీఎస్ పరిధిలో ఏడు ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 1,830 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా, 19,747 మంది పిల్లలకు ఈ కేంద్రాల్లో సేవలు పొందుతున్నారు. వేసవి కాలం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్న నేపథ్యంలో చిన్నారులు కేంద్రాలకు రావాలంటే కష్టతరంగా మారింది. 5 నుంచి 14 సంవత్సారాల వయస్సు గల పిల్లలకు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటి పూట బడులు పెట్టి అందుకు భిన్నంగా మాత్రం 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు రోజంతా బడి పెట్టడం ఎంత వరకు సమర్థనీయమని పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలకు కూడా పోషక ఆహారం అందిస్తారు. వేసవి ఎండలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు అదనపు పనివేళల భారంతో అనారోగ్యం భారిన పడే ప్రమాదం ఉంది. ఒంటి పూట బడుల విషయంలో ప్రభుత్వం నుంచి ఐసీడీఎస్ వారికి ఇంత వరకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని తెలిసింది.

స్వర్ణ కవచాలతో భద్రాద్రి రామయ్య

భద్రాచలం, మార్చి 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారిని వేములవాడ దేవస్థానం ఈవో డి.కృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.


రామాలయంలో వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణ



విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న పుల్లయ్య

కొణిజర్ల, మార్చి15: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తనికెళ్ల పాఠశాల హెచ్ఎం అబ్రహం ఆకాంక్షించారు. మండల పరిధిలోని తనికెళ్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరీక్ష సామగ్రిని శుక్రవారం ట్రస్ట్‌చైర్మన్ పరిశ పుల్లయ్య విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులంతా పట్టుదలతో చదవి పదికి పది జీపీ తెచ్చుకోవాలని కోరారు. ఉన్నత చదువులకు పదోతరగతి పరీక్షలే నాంది అని విద్యార్థులంతా కష్టపడి చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఖజానా అధికారి పసుమర్తి సుధాకర్‌రావు, పసుమర్తి శంకర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖమ్మాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

▸▸ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి15: ఖమ్మాన్ని ఆదర్శనగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నానని వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పలు డివిజన్లలో అభివృద్ధిపనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్‌లో నిర్మించే సీసీరహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు రామాలయం సెంటర్ వద్ద, 57వ డివిజన్ వికలాంగుల కాలనీలో, 5వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో, 2వడివిజన్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద నిర్మించే సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే 8వ డివిజన్ గోపాలపురం వద్ద, 27వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో నిర్మించే సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.25కోట్ల అంచనాలతో చేపట్టే ఖమ్మం-కొదుమూరు 2లేన్ల ఆర్&బీ రహదారిని 4లేన్లుగా విస్తరణ పనులకు మంత్రి తుమ్మల శంఖుస్థాపన చేశారు. అభివృద్ధే లక్ష్యంగా గతంలో పనిచేశానని, ఇప్పుడు అదే ఒరవడని కొనసాగిస్తున్నానన్నారు. ఖమ్మం నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో ఎంతో నాణ్యమైన రహదారులు నిర్మిస్తున్నామని, అలాగే మురుగునీటి సమస్య తీర్చేందుకు సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు అవసరమైన చోట మౌళిక వసతులు కల్పించే విషయమై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి

నగరపాలకసంస్థ సిబ్బందికి చెందిన సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వికలాంగుల కాలనీలో ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నగరమేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, నగరపాలకసంస్థ ఈఈ కృష్ణాలాల్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



గోపాలపురంలో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

క్యాంపు ఆఫీసులోకి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, లలిత దంపతులు

వైరా,మార్చి15: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. ఇప్పటివరకు వైరాలోని ఓ ప్రైవేట్ ఇంట్లోనే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే రాందాస్, లలిత దంపతులు కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించి క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కార్యద ర్శులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవ ర్యాలీ

వైరా,మార్చి15: వైరాలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవ ర్యాలీ నిర్వహించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ ఏర్పాటుచేశారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ మధిర సూపర్‌వైజర్ ధనమ్మ, సూపర్‌వైజర్ మాలతీకుమారి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, జ్యోతి పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్, మార్చి15: తెలంగాణ మండల పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర డైరీని శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బిసత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లాఅధ్యక్షుడు మల్లెల రవీంద్రప్రసాద్, కార్యదర్శి శాస్త్రి, కోశాధికారి జీవీఎస్ నారాయణ, సూర్యనారాయణ, శ్రీదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిరోధించాలి

అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 15: బాల్య వివాహల నిర్మూలనకు పటిష్టచర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్య వివాహల నిర్మూలన, బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణలో ఉన్న శిశువుల వివరాలు, దత్తతపై సమీక్షించారు. శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంక్షేమ సమితి,బాలల పరిరక్షణగా విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సభ్యులకు సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్షించారు. బాల్యవివాహాలు ఎక్కువగా నమోదవుతున్న మండలాలపై దృష్టి పెట్టాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వచ్చిన కాల్స్ సమాచారం పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి నెల ఫాలో అప్ చేయాలన్నారు. బాల్యవివాహాలు గురిస్తే వెంటనే ఎఫ్ఐఆర్ చేయాలన్నారు.బాల్య వివాహం జరిగిందని తెలిస్తే మండల తహసీల్దారులు బైండవర్ చేయించి లక్ష రూపాయలు ప్రభుత్వానికి చెల్లించే విధంగా బైండోవర్ చేయించాల న్నారు. దత్తతకి దరఖాస్తు చేసుకోవాలనుకున్న దంపతులకు అవగాహన కల్పించి వారు దరఖాస్తు చేసుకునేలా వివరాలు తెలియజేయలన్నారు. దరఖాస్తు చేసుకున్న దంపతులు నిర్వహించే గృహ అధ్యయన రిపోర్ట్ సకాలంలో నిర్వహించాలనారు. ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్లు రెస్క్యూ అయిన పిల్లల యొక్క ప్రస్తుత స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి,డి.చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విష్ణు వందన,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, లింగయ్య,అనిత తదితరులు పాల్గొన్నారు.

కమ్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

మధిరటౌన్,మార్చి15: కమ్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ఏర్పాటు చేయడం పట్ల ఆ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 16 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిందన్నారు. అందులో కమ్మ కులానికి కార్పొరేషన్ లేకపోవడంతో విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకుపోయామన్నారు. స్పందించి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేయటంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పుతుంబాక కృష్ణప్రసాద్, కర్నాటి రామారావు, పారుపల్లి విజయ్, పాటిబండ్ల సత్యంబాబు, నిడమానూరు వంశీ, మార్నీడి పుల్లారావు, చెరుకూరి నాగార్జున, కర్నాటి అశోక్, గడ్డం రమేష్, చావా వేణు, వీఎస్‌కె చౌదరి, సూర్యదేవర కోటేశ్వరావు, మాదాల రామారావు, మాగం ప్రసాద్, వెంకయ్య బాబు, దుంపా వెంకటేశ్వర రెడ్డి, బోడేపూడి గోపి తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఖమ్మం ఖానాపురంహవేలి: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని కమ్మ మహజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు, కార్యదర్శి కొడవర్తి నాగేశ్వరరావులు తెలిపారు. కమ్మ సామాజిక వర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అన్ని విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

చలసాని సాంబశివరావు హర్షం

సత్తుపల్లి: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో విడుదల చేసినందుకు కమ్మ సేవాసంఘ సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ చలసాని సాంబశివరావు శుక్రవారం హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదలను ఆదుకునేందుకు నిధులు కేటాయించాలని విన్నవించారు.





సంబరాలు చేసుకుంటున్న కమ్మసంఘ నాయకులు, చలసాని

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

ఖమ్మంచర్చికాంపౌండ్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసంఘం నాయకులు కొదుమూరు మధుసూదన్‌రావు మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మోసం చేసిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జి.వెంకటేశం, నగేష్‌కుమార్, ఎం.హనుమంతరావు, టీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి,మార్చి15: పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేస్తారు. అనంతరం జరిగే కార్యక్రమంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు. 12 గంటలకు చెర్వుమాధారం గ్రామంలో సీసీ రోడ్లకుశంకుస్థాపన చేస్తారని ప్రకటనలో తెలిపారు.

రైళ్ల హాల్టింగ్ కొరకు డీఆర్ఎంకు వినతి

బోనకల్, మార్చి15: బోనకల్ రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ సందర్శించారు. మూడోరైల్వేలైన్ పనులను పర్యవేక్షించారు. ఆయనను మండల అఖిలపక్ష నాయకులు కలిశారు. ఆర్వోబీ వలన ఖమ్మం బస్టాండ్ సెంటర్‌కు వెళ్లాలంటే ఇబ్బంది అవుతుందని అండర్ బ్రిడ్జి నిర్మించాలని, శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రావుట్ల సత్యనారాయణ, దొండపాటి నాగేశ్వరావు, గుగులోతు పంతు, కోలా వెంకటేశ్వర్లు, వీరభద్రం, పల్లపోతుల గోపి, రంగా జనార్ధన్ పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

చింతకాని: నాగులవంచ రైల్వే స్టేషన్ సమీపంలో 113వ గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని పాతర్లపాడు గ్రామస్థులు శుక్రవారం సికింద్రాబాద్ జోన్ డీఆర్ఎం భరత్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. మూడోరైల్వే లైన్ నిర్మాణ పనులు పరిశీలించేందుక వచ్చిన డీఆర్ఎం భరత్‌కుమార్‌ను ఎంపీటీసీ బొర్రా ప్రసాద్, మాజీ సర్పంచ్ కాండ్ర పిచ్చయ్య, మాజీ ఉపసర్పంచ్ తేలుకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నేడు పెనుబల్లిలో విద్యుత్ సరఫరా బంద్

పెనుబల్లి, మార్చి 15: పెనుబల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవితేజ తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పెనుబల్లి, వీఎంబంజర్, రామచంద్రరావు బంజర్, ఎడ్లబంజర్, సీతారాంపురం, టేకులపల్లి, బయ్యనగూడెం, నాయకులగూడెం గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని చెప్పారు.

ఉత్సాహంగా డీఆర్ఎస్ క్రీడోత్సవాలు

ఖమ్మంస్పోర్ట్స్,మార్చి15: నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీకళాశాల వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ శోభ ప్రారంభించారు. కబడ్డీ, చెస్, క్యారమ్స్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పలువురు అధ్యాపకులు ఉన్నారు.

పెనుబల్లి పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

పెనుబల్లి,మార్చి15: పెనుబల్లి మండల పంచాయ కార్యదర్శుల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జె.సీతరాములు, ఆర్.హరిన్ చక్రవర్తి, గౌరవాధ్యక్షుడిగా ఎన్‌వీ.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వి.వెంకటరామిరెడ్డి, వి.హరిత, కోశా ధికారిగా జి.సౌజన్య, కె.రాంప్రసాద్, వి.రవి కుమార్, శ్రీకాంత్‌ను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.





సీతరాములు, హరిన్

బుగ్గపాడులో దేవీ ఖడ్గమాల పారాయణం



సత్తుపల్లిరూరల్, మార్చి15: మండలంలోని బుగ్గపాడులో శ్రీవిశ్వధర్మ క్షేత్రంలో శివాలయంలో శుక్రవారం అన్నపూర్ణ అమ్మవారి ప్రత్యేక అభిషేకం, లలిత సహస్రనామ పారాయణం,దేవీ ఖడ్గమాల పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు తుమ్మూరు ప్రసాద్, దేవాలయ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని రద్దు చేస్తే సహించేది లేదు

ఖమ్మంరూరల్, మార్చి15: ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని ఈ విధానాన్ని కేంద్రం విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని ముత్తగూడెంలో పనులను శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని చూడటం సరికాదన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక పూర్తి

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి15: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మరియు రామాంతపూర్ పాఠశాలలకు 2024 విద్యా సంవత్సరంలో మొదటి తరగతికి జేసీ మధుసూదన్‌నాయక్ సమక్షంలో శుక్రవారం విద్యార్థుల ఎంపిక నిర్వహించారు. మొత్తం 24మంది దరఖాస్తులు చేయగా వారిలో లాటరీ పద్ధతిలో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేశారు. సాంఘీక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రైస్తవుల పాదయాత్ర

తల్లాడ, మార్చి 15: క్రైస్తవుల తపస్సు కాలంలో భాగంగా శుక్రవారం తల్లాడలోని లూర్థుమాత చర్చి నుంచి మండలంలోని గోపాలపేట లూర్దు గిరికొండ వరకు ప్రశ్చాతాప పాదయాత్ర నిర్వహించారు. లూర్దుమాత పుణ్యక్షేత్రం విచారణ గురువు పాదర్ అజయ్ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పాదర్‌లు ప్రాన్సిస్, మరియన్న, మనోజ్, ఉపదేశకులు పాల్గొన్నారు.

అన్నారుగూడెం హైస్కూల్లో ఆర్ట్ ఎగ్జిబిషన్

తల్లాడ, మార్చి15: మండల పరిధిలోని అన్నారుగూడెం జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులు చిత్రలేఖనం ద్వారా రూపొందించిన చిత్రాలతో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ ప్రారంభించారు. ఆరునుంచి పదోతరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులు రంగులతో రూపొందించిన పలు చిత్రలేఖన రూపాలను వీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిత్రలేఖనంలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడు షేక్.మదార్ సైదులు, పాఠశాల ఇన్‌చార్జ్ మాదినేని నర్సింహారావు పాల్గొన్నారు.

నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్‌కు హార్వెస్ట్ విద్యార్థి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి15: ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ నిర్వహించే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ జూనియర్ సైన్స్‌కు నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో 10వతరగతి చదివే సీహెచ్ కృష్ణమాధుర్ ఒక్కరే ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.రాష్ట్ర వ్యాప్తంగా 17మంది ఎంపికకాగా అందులో జిల్లా నుంచి హార్వెస్ట్ విద్యార్థి ఎంపికకావటం ఆనందంగా ఉందని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి శుక్రవారం విద్యార్థిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఐఎన్‌టీఎస్ఒ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి: శుక్రవారం ప్రకటించిన ఐఎన్‌టీఎస్ఒ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్) ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. పలువురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాబ్‌ట్యాబ్‌లను బహుమతులుగా గెలుచుకున్నారని, మరికొందరు గోల్డ్‌మెడల్స్ సాధించారని చెప్పారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం'పై విన్‌ఫీల్డ్‌లో అవగాహన

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి15: ఖమ్మం నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో శుక్రవారం ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు తీసుకుంటే కలిగే లాభాలను వివరించారు. విద్యార్థులు పండ్లు, ఫలాలను విరివిగా తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పోలవరపు శ్రీకాంత్ గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బుచ్చయ్య

తిరుమలాయపాలెం, మార్చి 15: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన పుసులూరి బుచ్చయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తెట్టెలపాడులో బుచ్చయ్య వర్ధంతి సభను నిర్వహించారు.

న్యూ లిటిల్‌ఫ్లవర్‌లో పది విద్యార్థుల వీడ్కోలు

వైరా,మార్చి15: వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో గురువారం రాత్రి పదోతరగతి స్టేట్, సెంట్రల్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోనే వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ఏవో ఎస్.నర్సింహారావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమేశ్వరరావు

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

సత్తుపల్లి,మార్చి15: పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని వాగ్దేవి పూర్వవిద్యార్థి సంఘ కోశాధికారి బాల నాగేశ్వరరావు ప్రకటించారు. శుక్రవారం మండలంలోని గంగారంలోని ఎస్డీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. పది పరీక్షలకు హాజరయ్యే 106మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో 6-9విద్యార్థులు అత్యధిక హాజరు శాతంతో పాటు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, థామస్, ప్రభాకర్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న నిర్వహకులు

కలెక్టర్‌ను సన్మానించిన బ్రాహ్మణపల్లి రైతులు

బోనకల్, మార్చి15: మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ గౌతమ్‌ను సన్మానించారు. భూముల యాజమాన్య హక్కుల కోసం 60 ఏళ్లుగా వారు నిరీక్షించారు. జడ్పీటీసీ మోదగు సుధీర్ సమస్యను 2022లో కలెక్టర్ వీ.పీ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు. సాగులో ఉన్నప్పటికీ ఎటువంటి యాజమాన్యపు హక్కులు లేక పోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాలను కోల్పోతున్నారు. రైతుల ఇబ్బందుల నేపథ్యంలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో రైతులకు పాసు పుస్తకాలను ఇప్పించారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామ రైతులు ఖమ్మంలో కలెక్టర్‌ను కలిసి శుక్రవారం సన్మానించారు. 60ఏళ్ల తమ కలను నేరవేర్చినందుకు ఎంతగానో రుణపడి ఉంటామని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



పద్మశాలి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి15:ఇటీవల మృతి చెందిన పలు పదశాలీల కుటుంబాలకు ఆసంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. గొళ్లపాడులో మోత్కూరు రఘుపతి, నగరంలోని పంపింగ్‌వెల్‌రోడ్డులో బింగి శ్రీనివాసరావు, దానవాయిగూడెంకాలనీకి చెందిన బొడ్డు సత్యనారాయణ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున మొత్తం రూ.18వేలను పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి శుక్రవారం అందించారు. ఈకార్యక్రమంలో చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, పెండెం జనార్ధన్, బండారు శ్రీనివాసరావు, దుస్సా సత్యనారాయణ, పిల్లలమర్రి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

సత్తుపల్లిరూరల్, మార్చి15: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, రింగ్‌సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ్‌కుమార్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది పెన్నబోయిన సత్యనారాయణ, అధ్యాపకులు తెల్లగొర్ల కృష్ణారావు, జీ.వీరన్న, పానెం రామచంద్రరావు, ఏ.సారంగపాణి, డాక్టర్ ఓ.చెన్నారావు, పీర్ సాహెబ్, బీఎం.వినోద్‌కుమార్, రాంబాబు, కే.రాజ్యలక్ష్మి, మధు, జీ.శ్రీనివాసరావు, జీ.వీరారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ నామా జన్మదిన వేడుకలు

మధిరటౌన్,మార్చి15: ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ పక్ష నాయకులు నామా నాగేశ్వరావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మధిరలోని వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, సోషల్ మీడియ ఇంచార్జ్ తాళ్లూరి హరీష్, రైతుబంధు కన్వీనర్ చావా వేణు, శివాలయం మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైరా: వైరాలో శుక్రవారం బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మునిసిపల్ కౌన్సిలర్ తడికమళ్ల నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ డి.కోటయ్య, గుజ్జర్లపూడి దేవరాజ్, ఏదునూరి శ్రీను, మాదినేని ప్రసాద్, లక్ష్మణ్, మోటపోతుల సురేష్, నందిగామ మనోహర్, దొంతెబోయిన గోపి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

కల్లూరు, మార్చి 15: మండలంలోని హనుమాతండా, లక్ష్మాతండా, గనియాతండా, చిన్నకోరుకొండి గ్రామాలల్లో శుక్రవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల శిబిరాలు నిర్వహించారు. స్థానిక పశువైద్యాశాల అధికారి కే మమత ఆధ్వర్యంలో ఈ శిబిరాలను నిర్వహించారు.

ముదిగొండ: ముదిగొండలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వైస్ఎంపీపీ మంకెన దామోదర్ ప్రారంభించారు.పశువైద్యసిబ్బంది టీకాలను పశువులకు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అశోక్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కారేపల్లి: మండలంలో పశువులకు గాలికుంటువ్యాధినివారణ టీకాల కార్యక్రమం ప్రారంభమైంది. మండల పశువైద్యాకారి ఎం.సత్యానారాయణ ఆధ్వర్యంలో కమలాపురంలో వైద్యాశాలలో కార్యక్రమం నిర్వహించారు.



హనుమాతండాలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి మమత